# "విశ్వనాథంగారి విశ్వరూపం"

రచన: పాకల రామానుజమ్మ

"లైటు వెయ్యక్కా! కనుపించడం లేదు" అధికారపూర్వకంగా ఆజ్ఞాపించాడు రవి అక్కని.

భారతి తమ్ముని చిరుకోపంచూచి చిన్నగా నవ్వుకొనివెళ్లి స్విచ్‌వేసివచ్చి రవిచేత లెక్కలు చేయిస్తుంది.

తలవంచుకు పాఠం చెప్పుతున్న భారతి ముఖంమీద లైటువెలుగు సూటిగా పడుతున్నది. అరవిరిసిన గులాబీమొగ్గలా వున్నది ఆ వదనం. పసిమివన్నె చాయ, శరీరం పొందిక, త్రాచుపాములా వెన్నున వేలాడేవేణి స్వచ్ఛమైన ఆ ముఖంలో నిర్మలమైన చిన్న చిరునవ్వు, చూచేవారిని యిట్టే ఆకర్షిస్తుంది. అయితే, ఆమెవేషధారణచూచిన, దరిద్రదేవత పూర్తిగా వరించివున్నదని మనం యిట్టే గ్రహించగలం.

దీక్షతో పాఠం చెప్పుతున్న భారతికి, అడుగులసవ్వడి వినిపించింది. భారతి అటువేపు చూసింది.

బావ ప్రసాద్ తమవైపేవస్తున్నాడు. భారతి త్రొట్రుపడుతూ లేచి నిలుచున్నది. అక్క బెదురుపాటుచూచి రవి కూడా అటుకేసి చూశాడు. అప్పటికే ప్రసాద్ వారి సమీపానికి వచ్చేశాడు. భారతి శరీరం కుంచించుకుపోయింది, ఆమె అక్కడనుండి తప్పించుకోగానికి ప్రయత్నిస్తూ, తన చిరుగుల చీరచెరుగుతో తన సౌందర్యం చాటుచేసుకుంటూ అవనతముఖియై ఒక అడుగు వెనక్కు వేసింది.

"భారతీ! కొంచం మంచినీళ్ళు తెచ్చిపెట్టగలవా?" అతిమృదువుగా అన్నాడు.

"అలాగే" అంటూ అక్కడనుండి చల్లగా జారుకుంది భారతి. ఎంతటి సోయగం? మనస్సులోనే గొణుగుకున్నాడు ప్రసాద్.

పరాకు చిత్తగించిన ప్రసాద్‌కి....

"బావా! కూర్చో అక్క యిప్పుడే మంచినీళ్లు తెస్తుంది" అన్న రవి పలుకులు విని తేరుకుని రవి ప్రక్కనే కూర్చొని "ఏం రవీ! మీ అక్కేనా నీకు చదువు నేర్పిస్తుందీ? బడికి పోవటంలేదా?" అని అడిగాడు రవి పుస్తకాన్ని ఒకటి తీసి తిరగవేస్తు.

"అమ్మో! బడికెళ్లకపోతే ఊరుకుంటుందీ, బడికి వెళ్లినా రాత్రుళ్లుకూడా చదువుకోవాలని ఒకటే గోల....నేను చదువుకొని ఉద్యోగం చేస్తే హాయిగా బ్రతకవచ్చునట .... అందుకని బడిలో యిచ్చిన హోమ్‌వర్కు తను రాత్రుళ్లు దగ్గరుండి చేయిస్తుంది .... అక్క ఉద్దేశం ఏంటో నాకు అర్థంకాదు బావా!" బావతో తన కష్టమంతా వెళ్ళబోసుకున్నాడు రవి. ఆ పసివాని అమాయకపు పలుకులు విని నవ్వి....

"అవును!....మీ అక్క చాలా చెడ్డదల్లే వుంది. లేకుంటే నీకు ఇంత శ్రమకలిగిస్తుందా?" అన్నాడు రవిని చూస్తు ప్రసాద్. బావ అలా అనడం రవికి రుచించలేదు. వాని ముఖంలో మార్పువచ్చేసింది....బావకేసి తీక్షణంగా చూచి—

"మా అక్క ఎంతో మంచిది! నీవే చెడ్డవాడవు....మేము పేదవాళ్ళమని, దిక్కులేని వారమని మీ రెవరూ మాతో మాటలాడరు అని మా అక్క చెప్పింది" అంటూ పిడుగుల్లాటి మాటలు కసికొద్దీ విసిరి, తన పగ తీర్చుకున్నట్టు గర్వంగా బావకేసి చూచాడు రవి.

ప్రసాద్‌ముఖం వివర్ణంఅయింది. అక్కడ మరొక్క క్షణం ఉండలేకపోయాడు....లేచి నిలబడి....

"ఒస్తాను రవీ! నువ్వు చదువుకో" అంటూ వెనక్కుతిరిగాడు .... ప్రసాద్ మేనత్త సుభద్రమ్మ గ్లాసుతో మంచినీళ్ళు పట్టుకునిలువబడి వున్నది.

"ఇందబాబు! మంచినీళ్ళు అడిగావట?" అని అందిచ్చింది. కృంగి కృశించిన దేహాన్ని తన జీర్ణవస్త్రంతో పదిలంగా కప్పుకొని....తన ముఖంలో విచారరేఖలు కనుపించకుండా పరిచారికస్థాయిలో వినయంగా మంచినీళ్ళు అందిస్తున్న మేనత్తను చూడలేక ఆమె అందిచ్చిన గ్లాసును అందుకొని గడగడాత్రాగి చకచక అడుగులువేసుకుంటూ వెళ్లిపోయాడు ప్రసాద్. మేనల్లుని ప్రవర్తనచూచి నివ్వెర



పోయిన సుభద్రమ్మ గొప్పవారితీరు యీరీతి గానే వుంటుంది గామాలు అనుకొని భారంగా నిట్టూర్పువిడిచింది.

ప్రసాద్ తిన్నగావెళ్లి మేడమీద గదిలో సోఫామీద కూలబడిపోయాడు. రవిపలుకులు అతని చెవిలో యింకా ప్రతిధ్వనిస్తునే వున్నయి.

రవి పలుకుల్లో ఎంతో సత్యంవుంది? నిజముగా నేను ఎంత చెడ్డవాడను అనుకొనేనరికి ప్రసాద్ మనస్సు చాలా ఆవేదనపడింది. పశ్చాత్తాపంతో దహించుకుపోతుందిహృదయం. మెదడులో అమితమయిన బాధ బయలుదేరి అతనికి మనస్థిమితం లేకుండా చేస్తుంది. మేనత్తకుటుంబం తమయింటికి వొచ్చిననాటి దృశ్యం కళ్లముందు చక్రాకృతిలో గిర్రున తిరిగింది.

ఆనాడు కాలేజీనుండి యింటికి వచ్చిన తాను అంతులేని ఆలోచనలో మునిగివున్న తల్లి తండ్రులను చూచి చకితుడయినాడు. తండ్రికేసి అర్థంకాని చూపులు చూశాడు.... అది గ్రహించి....

"బాబూ! ప్రసాద్ మీ మామయ్య పోయాడట టెలిగ్రామ్ వచ్చింది....పాపం. మీ అత్త సుభద్రకి తీరని ఆపద కలిగింది బాబూ.... మనంతప్ప వారికి ఎవరూ దిక్కులేరు. నేను రేపువెళ్లి వారిని ఇక్కడకే తీసుకువస్తున్నాను" అన్నారు విచారమైన కంఠస్వరంతో.

"అయ్యో! పాపం వారికి ఎంత కష్టం వచ్చింది? మీ రన్నట్లే చెయ్యండి నాన్నగారు" అంటూ తన గదిలోకి వెళ్లిపోయాడు. మరో రెండు రోజులకు మేనత్త కుటుంబం బండిలోనుంచి దిగడం చూచివచ్చారు గామాలనుకున్నాడు.

అప్పటినుండి వారివూసే తనకు పట్టలేదు. నేడే వారిని చూచాడు. వారు ఎంత హీన స్థితిలోవున్నారు? వారి ఆకారాలు చూస్తేనే వారు యిక్కడ ఎంత సుఖపడుతున్నారో.... అమ్మ వారిని ఎంత గౌరవిస్తున్నదో తెలుస్తూనే వుంది. ఆపాదమస్తకం అహంభావం ఆవేశించివున్న అమ్మ ఏ కోశానా వీరు తనతో తులతూగరని ఎంచి వారిని అగౌరవపరుస్తుండబట్టే, పరిచారికలకన్నా అసహ్యంగా వున్నారు అని అనుకొనేనరికి....ప్రసాద్‌ముఖం కోపంతో సెగలుగ్రక్కింది. భారతి నిజంగా ఆమె భారతిదేవే. ఆ ముగ్ధ మోహనమూర్తిని చూచిన కొలదీ చూడాలనే అనిపిస్తుంది. ఇంతకాలం గమనించలేదుగదా అని అనుకున్నాడు. అతనీ హృదయం అనిర్వచనీయమైనట్టి ఆనందంతో పుష్పంలా విప్పుకొని సున్నితమైనట్టి సుగంధాన్ని నింపేసింది. మద్రాసులో కాలేజీలెక్చరర్‌గా వుంటుండి, సీతాకోక చిలుకలవంటి కన్యలను దినమూ లెక్కలేనంత మందిని చూస్తు చూడడమే కాదు. తన యెదుట హొయలుచిందే ఒయ్యారాలతో పాఠాలు చెప్పించుకువెళ్లిన విద్యార్థినులు ఎంతమంది తనకుపరిచితులుకారు? వారినిచూచి ఎన్నడూ చకితుడు కాలేదు. ఈనాడు భారతి తనసౌందర్యంతో తనను ముగ్ధుణ్ణిచేసి తన మూర్తిని నా హృదయంలో చెరపరానిచిత్రంగా చిత్రించివేసింది. నేను నిజంగా అదృష్టవంతుడిని అనుకున్నాడు.

ఆ జడ్జీ జానకీరామయ్యగారమ్మాయి సుందరిని కోడలిగా చేసుకోడానికి అమ్మ తొందర పడుతున్నది. హొదాగల వారమ్మాయిని చేసుకుంటే తాను మరో అంతస్థుపైకి ఎక్కినట్టవుతుందని, సాటివారియెదుట తన గౌరవము యినుమడిస్తుందని....ఒకటే ఉబలాట పడిపోతున్నది. ఆ సుందరి సుందరాకారం నేతిబీరకాయివాటం, ఆ మిడిగ్రుడ్లమిటారిని ఎట్లా చేసుకోవడమా? అని దిగులుపెట్టుకు కూర్చున్న నాకు భగవంతుడు భారతీ సందర్శనం కలిగించి ఎనలేని ఉపకారం చేశాడు. భారతిమీద తనకు జన్మతావచ్చిన హక్కు విడనాడకూడదు. తన అభిప్రాయం తల్లితండ్రులతో ఎట్లా చెప్పడం? ఆలోచనలో పడ్డాడు ప్రసాద్.

మద్రాసులో లక్షలతో వ్యాపారంచేస్తున్న విశ్వనాథంగారి ఏకైక పుత్రుడు ప్రసాద్ కాలేజీ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు, విశ్వనాథంగారు చాలా ఉత్తములు. మంచి పలుకుబడిని సంపాయించారు.

ప్రసాద్ తండ్రిగుణాలను పుణికిపుచ్చుకున్నవాడు. విశ్వనాథంగారి భార్యా కాత్యాయని చండశ్శాసనురాలు అహంభావంతో కూడిన అహంకారం ఆమెలో అణువణువునా అగుపిస్తుంది. భర్తా, పుత్రులు ఒట్టి చవట దద్దమ్మలని ఆమె ఊహ. వారిని తన అదుపాజ్ఞలలో పెట్టుకొని ఆడిస్తువుంటుంది. ఆమె నోటిదురుసూ, పరువుపోయే ప్రవర్తనా చూచి ఉత్తమస్వభావులైన ఆ తండ్రి, బిడ్డలు వినీ విననట్లు ఊరుకుంటుంటారు.

తల్లితండ్రులయెడ భయభక్తులు కలవాడు ప్రసాద్. తల్లిఅంటే తగని భయం. ఏనాడు ఆమె యెదుటపడి మాటలాడలేదు. ఆమె ఏది చెప్పినా తలవంచుకు విని అపని ఆచరించేవాడు. అటువంటిది ఇప్పుడు ఆమెను ఎదిరించి తాను నిలవగలిగే ధైర్యం అలవరుచుకోవాలి. అందుకు సిద్ధపడడానికే నిశ్చయించుకున్నాడు ప్రసాద్. కాని ముందు భారతితో ఒక్కసారి మాటలాడి ఆమె అభిప్రాయం తెలుసుకోవడం అవసరమేమో అనుకున్నాడు. అయితే ఎలా మాట్లాడడం? వారు తమ యింటికివచ్చి సుమారు ఐదు సంవత్సరాలు కావస్తుంది. ఏనాడూ తాను వారిని పలకరించలేదు. వారు తమయింట లేనట్లే ప్రవర్తించాడు. అలాంటప్పుడు భారతికి తనపట్ల సదభిప్రాయం ఎలా వుంటది! తన బావ గర్వాంధుడని, అభిమానశూన్యుడని ఆమె తలపోయవచ్చును.

అలాంటప్పుడు తనని ప్రేమించి పెళ్ళాడగలదా? అయినా ఇప్పట్లో ఆమెతో కలుసుకు మాట్లాడడమే శ్రేయస్కరము అనుకొని ఒక నిశ్చయానికి వచ్చాడు ప్రసాద్.

* * *

బావనుండి తప్పించుకువచ్చిన భారతి తల్లితో మంచినీళ్ళు పంపించి వంటగది కిటికీ వద్ద అచేతనంగా శూన్యంలోకిచూస్తూ ఉండిపోయింది. ఎలాంటి పరిస్థితుల్లోకూడా తొణకని నీళ్లకుండలాంటిది భారతి మనస్తత్వం. భారతితండ్రి పోయే నాటికి పదమూడేళ్లది, స్కూలుఫైనల్ చదువుతుండగా తండ్రి గతించాడు. దిక్కుమొక్కులేని పరిస్థితిలో తల్లీ, తమ్మునితోపాటు మేనమామయింటికి వచ్చింది.

ధనగర్వంతో కళ్ళుకప్పుకుపోయిన కాత్యాయనీ....కడుపుచేతుల్లో పట్టుకువచ్చిన ఆడబిడ్డని ఎలా ఆదరిస్తుందో ఊహ కందనివిషయము. వారిచేత అరవచాకిరీ చేయించుకుంటున్నా, భారతి సుభద్రలు కిక్కురుమనకుండా విధికిబద్ధులై రోజులు గడుపుకువస్తున్నారు. వివేకవతి అయిన భారతి, భాగ్యవంతుల స్వభావాలు సహజంగా అహంతో కూడుకొనివుంటాయని స్వానుభవంవల్ల తెల్సుకున్నది. వారి అంతస్థుకుతగని తాము సాధ్యమైనంతమటుకు వారికంటపడకుండా తప్పుకోవడమే ఉచితమని భావించి వారి యింటికి వచ్చిన అతిథులకుగాని, కనీసం మేనమామ, బావలకుగాని కనుపించకుండా తప్పుకుంటూ మసలుకువస్తున్నది.

ప్రసాద్‌ని ఒకటి రెండుసారులు దూరంగా చూచింది భారతి. వెంటనే తన దృష్టి అటు

నుంచి మళ్లించేసుకున్నది. ప్రసాద్ అంటే మంచభిప్రాయంలేదు. అతనిలో ప్రేమాభిమానాలు, జాలీ కరుణలు శూన్యమనీ గొప్పవాడననే గర్వం సంపూర్ణంగా వుందని, అమ్మ పోలికలు అబ్బాయికిమాత్రం రాకుంటాయా, అనే దురభిప్రాయం ఆమెలో పాతుకుపోయినది. అంతేగాని 'పుల్లనిచల్లలో కమ్మనివెన్న' ఎలా పుడుతుందని ఆ అమాయకురాలు గుర్తించలేకపోయింది. కానీ ఏనాడూ ఊహించని సంఘటన ఈనాడు జరిగింది. ఏనాడూ తాను అంతచేరువలో తారసపడలేదు. సంస్కారములేని తన వేషం చూచి ఏమనుకొని వుంటాడు? అనుకుంటే అనుకుంటాడులే.... మా లాంటి అభాగ్యులు ఇంకెలా వుంటారు? అతనెలా అనుకుంటేమాత్రం నాకు పోయింది యేమీలేదు. అసలు అక్కడికి రావలసిన అవసరం అతడికి ఏమొచ్చింది ? వచ్చాడేపో సలజ్జిత అయిన కన్యని మంచినీళ్ళు తెమ్మనడంలో ఉద్దేశం? నన్ను న్యూనతపరచడానికా లేక కొంటెతనమా ? ఆమెముఖం రోషంతో జేవురించింది అంతలోకే.

"భారతీ! ఏంటా దిక్కులుచూస్తూ నిలుచున్నావ్? రేపు మేము బెజవాడ వెళ్ళాలి సంబంధం చూసుకోడానికి. వెళ్లేటప్పుడు ఒట్టి చేతులతో ఎలా వెళ్లడం....పిల్లలచేతుల్లో పెట్టటానికి మైసూర్‌పాకం చెయ్యమన్నాను మీ అమ్మని. వెళ్ళి ఆమెకు సహాయం చెయ్" అంటూ తుపాన్‌లా వొచ్చిచెప్పేసి ఆడావుడిగా వెళ్ళిపోయింది కాత్యాయనీ. భారతి తన ఆలోచనలు అవతలకు నెట్టి అమ్మకి సహాయం చేయడానికి వెళ్ళింది.

వంటగదిలో తల్లికి సహాయం చేస్తున్న భారతిదగ్గరకు రవి ఒచ్చి అక్కచెవిలో ఏదో రహస్యం చెప్పాడు. వెంటనే భారతి కపోలాలు ఎఱ్ఱగా జేగురుముద్దల్లా తయారయి రవి దవడమీద అర్ధ చంద్ర ప్రయోగం జరిగిపోయింది.

"పనికిమాలిన వెధవ! ఇలాంటివార్తలు మోసుకువచ్చావంటే దవడపళ్లు రాల్తాయ్! జాగ్రత....పో! నా ఎదుటనుండి" అంటూ పటపట పళ్ళు కొరికింది తీవ్రంగా తమ్ముని కేసిచూస్తూ.

అక్క రౌద్రాకారంచూచి గట్టిగా ఏడవలేక అక్కడనుండి కదలలేక చేష్టలుడిగి కళ్లలో నీళ్ళు తిరగగా కంపిస్తూ నిలుచుండిపోయాడు రవి. సమయానికి సుభద్రమ్మ అక్కడ లేకపోవడం మెరుగయింది. ఉద్రేకపూరితురాలయిన భారతి కొంతవడికి తేరుకొని, జాలి గొలిపే వదనంతో నిలుచున్న తమ్ముని చూచింది. ఆ దృశ్యం చూడగానే ఆమెగుండె చెరువయిపోయింది, కళ్లవెంట అప్రయత్నంగా నీళ్లు జలజలాకారిపోయాయి. చెప్పరాని బాధతో తమ్ముని అక్కున చేర్చుకొని, గాద్గదికస్వరంతో తమ్ముని చుబుకం పుచ్చుకొని....

"బాబూ! మీ అక్కను క్షమించవ్? చూడు బాబూ! ఇలాంటికబుర్లు ఎప్పుడూ తేకూడదు. మనలాంటి అనాథలకు మానమర్యాదలు కాపాడుకోవడం కూడా కష్టమే. యీ పాడు చేతులతో నిష్కారణంగా నిన్ను కొట్టాను" అని క్షణంపాటు వ్యాకులపాటుతో తమ్ముని తన కౌగిలిలో యిముడ్చుకొని వాపోవసాగింది భారతి.

అంతలోకే ప్రసాద్ గుర్తుకువచ్చాడు. పట్టరాని కోపం ముంచుకువచ్చింది. ఎంత నీచ స్వభావం....ఏకాంతంలో తనతో మాట్లాడవలసిన అగత్యం ఏమొచ్చింది ? కూటికి లేనంత మాత్రంలో గుణాలు కూడా లోపిస్తాయనుకున్నాడా? అని అనుకుని కలం కాగితం తీసి ఏదో దానిమీద గబగబా వ్రాసి 'ఇదిగో రవీ! ఇది తీసుకుపోయి బావకిచ్చిరా' అంటూ వాని చేతిలో ఆ లేఖను వుంచింది.

రవి కిక్కురుమనకుండా అక్కడనుండి వెళ్లిపోయాడు.

రవికి బావమీద బోలెడంత కోపం వచ్చింది బావమూలంగానే అక్క యీరోజు కొట్టింది. రవి పట్టరాని ఆవేశంతో బావదగ్గరకు వెళ్లి అక్కయిచ్చిన లేఖ బావకందిస్తూ .... 'ఇందతీసుకో! నీమూలంగా నాకు దెబ్బలు తగిలాయి చూడు బావా! ఎలా నా దవడ వాచిపోయిందో' అంటూ చెమ్మగిల్లినకళ్లతో తన లేతబుగ్గ తడుముకున్నాడు రవి. రవి బుగ్గ చూచి కంగారుపడిపోయాడు ప్రసాద్. అతని హృదయం జాలితో క్షోభించిపోయింది. భారతి తనను అర్థంచేసుకోలేక తాను పంపిన కబురు విని అపార్థంచేసుకొని కోపంతో ఈ పసివానిని దండించి వుంటుందని గ్రహించుకున్నాడు. తొందరగా ఆ లేఖ విడదీసి చదువుకున్నాడు.

శ్రీ బావకి....................

అవివాహితలైన యువతీయువకులు ఏకాంతంలో కలుసుకుమాట్లాడడం....హద్దులుదాటి ప్రవర్తించడం. మనజాతి గౌరవానికి....సాంప్రదాయానికి తగనివిషయం. మీకోరిక మన్నించనందుకు క్షమించవలెను,

ఆ లేఖ చదివి పరాభవంతో కూడిన కోపం, పొరపాటుపని చేసానేమో అనే అనుమానం అతనిని హతాశుడినిచేసింది. భారతి వ్రాసినదాంట్లో అసత్యం యేమీ లేదనీ, అనాలోచితంగా తాను చేసిన పనికి తగువిధంగా బుద్ధిచెప్పిందని అనుకున్నాడు.

ఊసరవెల్లిలా బావముఖంలో రంగులు మారుతుండడం చూస్తున్న రవి తన రెండో బుగ్గకి అపాయంరాకుండా జాగ్రతపడసాగాడు కానీ, అటువంటిది ఏమీ జరగలేదు.

ప్రసాద్ ప్రసన్నవదనంతో రవిని చేరువకు పిలచి, మృదువుగా వాని బుగ్గ నిమురుతూ, 'తప్పుచేసినవాడను నేనైతే దండింపబడ్డవాడవు నీవయావు. పోనీలే విచారించకు. త్వరలోనే మీ అక్కమీద పగతీర్చుకుందాములే' అన్నాడు చిన్నగా నవ్వుకుంటూ ప్రసాద్. ఈసారి రవి తికమకపడ్డాడు. బావ మంచితనం చూస్తే అక్కకన్నా బావే మంచివాడేమొ అనే సందేహం కలిగింది. అక్కమీద పగతీర్చుకుందామన్న బావపలుకులలోని అంతరార్థం ఆ పసివానికి అర్థంకాక 'అలాగేలే బావా! అంటూ అక్కడనుండి వెళ్లిపోయాడు.

★ ★ ★

"ప్రసాద్! నిన్న మీ నాన్నగారు, నేను బెజవాడ వెళ్లివచ్చాము అన్నది కాత్యాయనీదేవి కాలేజికి వెళ్లడానికి డ్రస్ అవుతున్న కొడుకుని సంబోధిస్తు—

"ఎందుకమ్మా?" ఆశ్చర్యం నటిస్తు అడిగాడు ప్రసాద్. "ఎందుకేమిటిరా! తెలియనట్లు ప్రశ్నిస్తావ్. ఇదివరకే చెప్పానుగా జడ్జీగారమ్మాయిని చూడడానికి వెళ్ళాలనీ. పిల్ల బాగానే వున్నది. నీవు చూచిందే. పదిహేను వేలు కట్నం పెడతారట. తక్కిన లాంఛనాలన్నీ ఉండనే వున్నాయి. మన అంతస్తుకి తగిన వియ్యం కాత్యాయని గర్వంగా చెప్పుకుపోతున్నది.

"నేను ఆ అమ్మాయిని చేసుకోనమ్మా! నన్ను బలవంతంచేయకు" అన్నాడు ప్రసాద్. నెమ్మదిగా అన్నా ఆ కంఠధ్వనిలో దృఢత్వం ఉన్నట్లు ధ్వనించింది. కొడుకుమాటలు విన్న కాత్యాయని కాలనాగులా అయింది.

"ఎందుకు యిష్టంలేదో స్పష్టంగా తెలియజెయ్! అని గట్టిగా గర్జించింది.

తెలియజేయడానికి ఏముంది! ఇంట మేనరికం వుండగా పైసంబంధంకోసం పాకులాడ్డం అవివేకం. భారతి సలక్షణమైన కన్య అన్నివిధాలా ఆమె నాకు తగిన భార్య. భారతిని

తప్ప వేరే అమ్మాయిని చేసుకోను. ఇదే నా దృఢనిశ్చయం" అని కచ్చితంగా చెప్పేసరికి కాత్యాయనీ, విశ్వనాధులు కలయో వైష్ణవ మాయయో అన్నట్లు దిమ్మెరపోయి కొడుకు ముఖంలోకి వింతగా చూచారు ఆ ముఖం తన నిశ్చయానికి తిరుగులేనట్లు గంభీరంగా కనుపించింది. ఎన్నడు తమమాట జవదాటని వాడిలో ఇంత మార్పు ఎలా కలిగిందా? అనే ఆశ్చర్యం ఆ దంపతుల్ని వివశుల్నిచేసింది. వారు ఆ విభ్రాంతినుండి తేరుకొని తలయెత్తి చూచేసరికి అక్కడ ప్రసాద్ లేడు. కాత్యాయనీదేవి కళ్లు అగ్నిగోళాలలా తయారయి ఆమె అహం దెబ్బతిన్నది. జరిగిన అవమానం భరించలేకపోతున్నది. దుఃఖం రోషం ముంచుకురాగా కోపంతో భర్తకేసిచూసింది. ఈ అంతర్నాటకంలో భర్తకూడా ఒకపాత్ర ధారుడేమొ అని ఆమె అనుమానం.

విశ్వనాధంగారు నిండుకుండలా తొణగకుండా అచంచలంగా సోఫాలో కూర్చొని వున్నారు. ఆయనగారికి కొడుకుప్రవర్తనతో కనువిప్పు కలిగినట్లువున్నది. సోదరి సుభద్ర కళ్లముందు కదిలింది. 'నిజమే మేనకోడలు ఉండగా వేరే సంబంధం చూడడం పొరపాటే. నేను యీమెనోటికి జడిసి యింతవరకు వారి విషయం విస్మరించి వూరుకున్నాను.

పాపం! సుభద్ర యీ కాత్యాయని కరకు హస్తాలలో ఎలా నలిగిపోతున్నదోకదా? దిక్కులేక తన అన్నపంచనుచేరిన సుభద్రకి అగచాట్లుపడవలసిన గతిపట్టింది. ఆమె పరిస్థితి ఎలా ఉంటదో ఊహించుకొనేసరికి భార్యామీద చెప్పరానంత ఏవగలిగింది. 'ఛీ! ఇంతకీ నా అశక్తతే కారణం. భార్యని లొంగదీయని బ్రతుకు ఒక బ్రతుకేనా? ఇంతకాలం కాత్యాయని ఆటలు సాగాయి. ఇక ఆమె ఆట కట్టవలసిందే! దానికి ప్రాయశ్చిత్తం భారతిని కోడలిగా చేసుకొని యీ యింటికి అత్తగారి తదనంతరం ఉత్తరాధికారిణిగా చేయడమే అని కృతనిశ్చయుడయినాడు అంతట్లోకే.

"ఏం! అలా మట్టివిగ్రహంలా చూస్తూ వూరుకున్నారు? కొడుకు ముద్దుపలుకులు వినముచ్చటవేసిందా? లేక మేనకోడలు కోడలవబోతున్నదికదా అనే ఆనందంలో మాటలు రావటంలేదా?" అంటూ వెటకారం ధ్వనించే కంఠంతో భర్తకేసి తీక్షణంగా చూస్తూ అడిగింది కాత్యాయని. కానీ ఈసారి భార్యా తీక్షణ వీక్షణాలకు గడగడలాడలేదు. అతనిలోని పిరికితనం అంతర్ధానం అయింది. భార్య పొగరుమోతు పలుకులు వినగానే అతని హృదయం భగ్గున మండింది. వెంటనే విశ్వనాధంగారు విశ్వరూపం ధరించారు.

"నోర్ముయ్! దుష్టురాలా! నీకు యింతగా అలుసు యివ్వబట్టే నెత్తికెక్కి తాండవిస్తున్నావు. పాపిష్టురాలా! ధనగర్వం, నోటిదురుసుతనం, నిన్ను మదించిన పశువుగా తయారు చేసింది. నీ నోటికి జంకి, వీధినిపడి పరువు ప్రతిష్టలు పోగొట్టుకోలేక వూరుకోబట్టి, నీవు ఆడింది ఆటగా పాడింది పాటగా ఇంతకాలం సాగింది. ఇంక నీ అహంకారం అట్టిపెట్టు.... నా రక్తం పంచుకుపుట్టిన సోదరి సుభద్రని నీపాలపడవేసి నిష్కారణంగా ఇంతకాలం కష్టపెట్టాను. సాధుశీల సౌమ్యమూర్తి అయిన సుభద్ర నీవు పెట్టిన రంపపుకోతలన్నీ ఎలా భరిస్తున్నదో ... ఈనాడు కళ్ళుతెరిచిన నేను ఊహించలేకపోతున్నాను. మన పాపానికి నిష్కృతిలేదు. దానికి ప్రాయశ్చిత్తంగా నా మేనకోడలు భారతిని నా కోడలిగా చేసుకోవడమే. యీ యింటికి ఉత్తరాధికారిణి ఆమే అవగలదు. నిజంగా యీవిషయంలో నాకళ్లు తెరిపించిన ప్రసాద్, చిన్నవాడయినా వాడికి కృతజ్ఞత లర్పించుకోవాలి నోరుమూసుకుపడి వుండు" అంటూ చివాలున లేచి అక్కడనుండి వెళ్ళిపోయారు విశ్వనాధంగారు.

కాత్యాయనీదేవికళ్ళు బైర్లుకమ్మాయి. లోకమంతా పచ్చగా కనుపించింది. ఒక్కసారి కళ్లు గట్టిగా నలిపి నలువైపులా చూచింది ఈ రోజు యింత దుర్దినంగా మారడం ఏమిటో యింద్రజాలంగా అనిపించింది. అటు కొడుకు, యిటు భర్త విచిత్రంగా మారిపోయారు.

ఎప్పుడూరాని మేనమామ మూడు అంతస్తులుదిగి అమ్మతో మాట్లాడడానికి వచ్చాడంటే ఆశ్చర్యంతో భారతి తన చెవ్వులను తానే నమ్మలేకపోయింది. ఆమెలో ఆందోళనకూడా ఆవహించింది,

నేను వ్రాసినదానికి బావ కోపగించి.... తండ్రితో చెప్పి తమ్ము ఇంటనుండి వెడలగొట్టడానికి పంపలేదు కదా ? అదే సత్యమైతే.... యీ దిక్కులేని అనాధలమైన మమ్ము ఎవరు ఆశ్రయంయిచ్చి ఆదరిస్తారు? ఇకమీదట తమ జీవనోపాధి గడవడమెట్లా? అనే దీర్ఘచింతలో పడిపోయింది భారతి. అలా ఆలోచిస్తు కూర్చున్న భారతిభుజంమీద అనురాగపూర్వకమైన చల్లని హస్తస్పర్శతాకగానే తృళ్ళిపడ తలయెత్తిచూచింది. ఎట్టయెదుట తల్లి కనుపించింది. జీవితంలో తొలిసారిగా పొందిన ఆనందాన్ని అణిచిపెట్టుకోలేక ఆనంద బాష్పాలు విడుస్తూ....

"అమ్మా! నీవు అదృష్టవంతురాలవమ్మా!" అంటూ కుమార్తెను కౌగలించుకున్నది సుభద్రమ్మ. ఆమెకళ్లవెంట నీళ్లు జలజలా కారి భారతి శిరస్సు తడిపివేశాయి.

భారతి దిగ్భ్రాంతురాలయిపోయింది.... ఎప్పుడూ కృంగదీసే చింతాభారంతో మలినమయివుండే ముఖంలో యీ సంతోషతరంగాలేమిటి? ఈ పరవశత ఎందుకో అర్థంకాలేదు ఆమెకు, వింతగా తల్లికేసిచూస్తు ఉండిపోయింది. కొంతవడికి సుభద్రమ్మ తన్మయావస్థనుండి తేరుకొని....

"వెఱ్ఱితల్లీ! కొద్దిరోజుల్లో ఈ యింటికి కోడలవు మీ మామయ్యా ఈ కబురుచెప్పడానికే వచ్చాడు. మీ ప్రసాద్‌బావ నిన్నుతప్ప వేరే కన్యని వివాహంచేసుకోనని పట్టుపట్టాడట. మీ మామయ్యకూడా ఎంతో సంతోషిస్తున్నాడు. వచ్చే వైశాఖంలో పెండ్లిచేయడానికి నిశ్చయించానని చెప్పాడు. ఆ ప్రసాద్ నీ పాలిటి భాగ్యరేఖ తల్లీ! ప్రసాద్ దేవతలాంటివాడు" అంటూ కుమార్తెతల అనురాగపూర్వకంగా నిమరసాగింది. ఆ మాటలువిన్న భారతి, ఆశ్చర్యమో, ఆనందమో చెప్పరానిపరిస్థితిలో పడిపోయింది.

★ ★ ★

ఆదినం తలంటిస్నానంచేసిన భారతి లేత గులాబివన్నె చీరకట్టుకొని ముదురాకు పచ్చ జాకెట్టు తొడుక్కున్నది. ఆ వేషంలో అపర రతీదేవిలావున్న ఆమె సోఫాలో కూర్చొని ఫేన్ విసిరేగాలితాకిడికి ముంగుర్లు ముఖంమీదపడి లాస్యంచేస్తుంటే, విసుక్కొని తనచేతితో వాటిని మృదువుగా వెనక్కినెట్టుతూ రవి అప్పచెప్పుతున్న పాఠాన్ని శ్రద్ధగా వింటున్నది. అంతట్లోకే ప్రసాద్ రెండు గులాబీలను చేత్తోపట్టుకొని వాటిని సవిలాసంగా ఇటునటూ ఊగిస్తు అక్కడకు వచ్చాడు. భర్తనుచూచి, భారతి చివాలున లేవబోయింది కాని, ప్రసాద్ ఆమెను లేవకుండాచేసి........

"ఇదిగో యీ రెండు గులాబీలు తల్లో పెట్టుకో" అన్నాడు పువ్వులు భారతికి అందిస్తు. భారతి భర్తయిచ్చినపూవులు తలలో తురుముకున్నది.

"ఆ! యింక లేచివెళ్లి మంచినీళ్ళు కొంచం తెచ్చిపెట్టు చూడూ! మీ అమ్మతోమాత్రం పంపబోకేం?" అన్నాడు భారతికేసి చూచి నవ్వుతూ.

భర్త చిరునవ్వులోని వ్యంగ్యం గ్రహించిన భారతి, తానుకూడా చిన్నగా నవ్వుతూ 'లేదులెండి! పరిస్థితులు మారిపోయాయిగా....ఇక పరవాలేదు, కావలసినన్ని మంచినీళ్ళు మీకు స్వహస్తాలతో సమర్పించుకోగలను' అంటూ మంచినీళ్ళుతెచ్చి భర్తకిచ్చింది భారతి. అక్కాబావల చలోక్తులు అర్థంకాక తెల్లబోయి చూస్తున్న రవిచేతులో బిస్కెట్టు ప్యాకెట్టుపెట్టి భారతితోపాటు పూలతోటలోకి నడిచాడు ప్రసాద్. కొడుకూ, కోడలూ జంటగా పోవడం మూడో అంతస్థునుండి కనుగొన్న కాత్యాయనీదేవి చూడలేక చూపును మళ్లించుకున్నది.

★